ఆఖరి మజిలీలో కనీస వసతులేవి ?

నిధులున్నా ముందుకు సాగని శ్మశానవాటిక అభివృద్ధి పనులు

అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



మదాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణకాలనీలోని శ్మశానవాటిక ఇదే..

హఫీజ్‌పేట్: మదాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణ కాలనీ శ్మశానవాటికలో కనీస వసతులు కరువయ్యాయి. ఇటీవల ఆఖరి మజిలీలను మహాప్రస్థానాలుగా మర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. కానీ శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయించినా.. పనులు ముందుకు సాగడం లేదు. గత కొద్ది నెలల క్రితమే చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్లు శ్మశానవాటికను సందర్శించి పరిశీలించారు. వెంటనే ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రత్యేక నిధుల కింద రూ.10 లక్షలు కేటాయించారని కాలనీవాసులు చెబుతున్నారు.

◆ కాంట్రాక్టర్ అసంపూర్తిగా చుట్టూ ప్రహరీ నిర్మించి వదిలేసి వెళ్లిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆఖరి మజిలీకి వచ్చే ప్రజలకు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ శ్మశానవాటికలో కాలనీవాసులు ప్రధాన గేటుతో పాటు చిన్నపాటి షెడ్డు కూడా దాతల ద్వారా నిర్మించుకున్నారు. కాలనీలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ఉన్నతాధికారులు కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నెలకొన్న సమస్యలివే..

◆ శ్మశానవాటిక కోసం రూ.10లక్షల నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాలేదు.

◆ ప్రహరీ లేకపోవడంతో శ్మశానవాటిక ముందే కుప్పలు తెప్పలుగా చెత్త, చెదారం ప్రజలకు కనీస వసతులు కరువయ్యాయి.

◆ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిననా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది.

◆ కాలనీలో డ్రైనేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు.

◆ రోడ్లపైనే చెత్తచెదారం వేయడంతో దుర్గంధం వెదజల్లుతుంది. టాయిలెట్స్ నిరుపయోగంగా ఉన్నాయి.

సమస్యల పరిష్కారం కోసం..

◆ పెండింగ్‌లో ఉన్న శ్మశానవాటిక అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి.

◆ స్నానపు గదులు, కుళాయిలు వెంటనే ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

◆ శ్మశానవాటిక చుట్టూ.. అసంపూర్తిగా ఉన్న ప్రహరీని పూర్తి చేసి, ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయాలి.

◆ విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్ల కోసం విడిగా స్తంభాలను ఏర్పాటు చేయాలి.

◆ రోడ్లపై వ్యర్థాలు వేయకుండా డబ్బాలు పెట్టి వాటిలోనే వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలి.





శ్మశానవాటికలో తాత్కాలిక షెడ్డు, కట్టెలతో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

ప్రత్యేక నిధులు కేటాయించినా.. పనులు సాగడం లేదు..



కాలనీ ఏర్పడినప్పటి నుంచి తాను ఇక్కడే ఉన్నా.. కాలనీలో నెలకొన్న సమస్యలు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా. శ్మశానవాటిక అభివృద్ధికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే తన ప్రత్యేక నిధులు రూ.10 లక్షలు కేటాయించారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అభివృద్ధి నిలిచిపోయింది. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి పనులను పూర్తి చేయించాలి.

– కృష్ణయాదవ్, కృష్ణకాలనీ అధ్యక్షుడు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే అసంపూర్తి పనులు...



కృష్ణ కాలనీ శ్మశానవాటిక అభివృద్ధి పనులు కాంట్రాక్టర్ వల్లనే అసంపూర్తిగా ఉంది. ప్రహరీ దు వైపుల నిర్మించి దిలేశాడు. కనీస వసతులు కూడా ఏర్పాటు చేయకుండా వెళ్లిపోయాడు. ఆఖరి మజిలీలో ఇబ్బందులు తీవ్రంగా ఉంటున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు శ్మశానవాటికలో కనీస వసతులను కల్పించేందుకు కృషి చేయాలి.

– హరి, కృష్ణకాలనీ

భాష, వ్యాయామ పండితుల సమస్యను పరిష్కరించండి



ఎమ్మెల్సీ కోదండరాంకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్‌యూపీపీ నాయకులు

కూకట్‌పల్లి: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ (ఆర్‌యూపీపీ 1927) రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా సోమవారం ఎమ్మెల్సీ కోదండరాంను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన కోదండరాంకు పుష్పగుచ్ఛం అంజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భాషా పండితుల, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్యల గురించి చర్చించారు. రెండు దశాబ్దాల కాలం నుంచి పదోన్నతులు పొందని ఏకైక క్యాడర్ భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు మాత్రమేనని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన కోందండరాం ఖచ్చితంగా సమస్యను పరిష్కరించి పదోన్నతులు లభించే విధంగా తన వంతు సహాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి వీఎస్ఎస్ శర్మ, రాష్ట్ర బాధ్యులు సాబిర్ పాషా, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రోహిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 38 ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జెడ్సీ అభిలాష అభినవ్, అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని జెడ్సీ అభిలాష అభినవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన 38మంది నుంచి ఫిర్యాదులు అందాయని ఆమె తెలిపారు. మూసాపేట 5, కూకట్‌పల్లి 1, కుత్బుల్లాపూర్ 3, గాజులరామారం 12, ఆల్వాల్ 4, కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం పరిధిలో 14 మంది సమస్యలను పరిష్కరించాలని వినతపత్రాలు అందజేశారన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

జెడ్సీకి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ వినతి



కూకట్‌పల్లి జెడ్సీ అభిలాష అభినవ్‌ను కలిసిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా నూతనంగా నియమింపబడిన అభిలాష అభినవ్‌ను సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన జెడ్సీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, కూకట్‌పల్లి పార్టు డివిజన్ల అభివృద్ధి పనులపై ఆమెతో చర్చించారు.

◆ అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరామన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. గతంలో అభివృద్ధి పనులకు నెలకు డివిజన్ల వారీగా రూ.8 కోట్లు విడుదల అయ్యేవని తెలిపారు. ప్రస్తుతం రూ.4 కోట్లు మాత్రమే మంజూరు అవుతున్నాయని పేర్కొన్నారు. అవి కూడా సకాలంలో అందడం లేదన్నారు. అభివృద్ధి పనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వర్షాలకు గుంతలు పడితే పూడ్చలేని పరిస్థితి నెలకొందన్నారు. రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరానన్నారు.

◆ అదే విధంగా చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి చేపట్టాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. సమస్యల పరిష్కారంపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి రంగారావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసం 11 కేవీ ఫీడర్ పరిధిలోని జయానగర్ రోడ్ నం.1 నుంచి 5 వరకు, భాగ్యనగర్ కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..

◆ జన్మభూమి ఫీడర్ పరిధిలోని జన్మభూమి కాలనీ, శివమ్మ కాలనీ, దత్తాత్రేయ కాలనీ, సుభాష్ చంద్రబోస్‌నగర్, గాంధీనగర్, మొగులమ్మ బస్తీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలో..

◆ మూసాపేట: ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. కూకట్‌పల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం, మూసాపేట, యాదవబస్తీ, జనతానగర్, ఆంజనేయనగర్ ప్రాంతల్లో మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు.

◆ కేపీహెచ్‌బీ 4వ ఫేజ్,ఆర్‌టీఏ కార్యాలయ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డా.మల్లు రవికి శుభాకాంక్షలు

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన డా.మల్లు రవిని కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరావు, అరవింద్ రెడ్డి, చున్ను పాషా తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మూసాపేట: మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ తండ్రి కొడిచర్ల సాయిలు ఆదివారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం ఉదయం కార్పొరేటర్ మహేందర్‌ను పరామర్శించారు. అనంతరం నియోజకవర్గ కార్పొరేటర్లతో కలిసి సాయిలు పార్థివదేహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యేపట్ల పలువురు నాయకులు, ఎమ్మెల్యే ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అదే విధంగా మాజీ కార్పొరేటర్లు బాబూరావు, తూము శ్రావణ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, నాయకులు బండి రమేష్, ప్రేమకుమార్, బీజేపీ నాయకులు కార్పొరేటర్ మహేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఫిబ్రవరి 3న కేటీఆర్ రాక

ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం



క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 3వ తేదీన ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో జరగబోయే కార్యకర్తల సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ విచ్చేయుచున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు.

◆ అదే విధంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన సూచనలు కేటీఆర్ 3వ తేదీ సమీవేశంలో వివరిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ విచ్చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్‌లు ముద్దం నర్సింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్ గౌడ్, మహేశ్వరి శ్రీహరి, జూపల్లి సత్యనారాయణ, సబిహా బేగం, మాజీ కార్పొరటర్లు తూము శ్రావణ్‌కుమార్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలి



తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కావేటి మల్లికార్జున్ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు, బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానస సరోవర్ హైట్స్ దగ్గర అక్రమంగా ఏర్పాటు చేస్తున్న సాదుళ్ల లేఅవుట్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను అడ్డుకోవాలని కోరారు. సదరు డెవలప్‌మెంట్ పనులపై కూల్చివేతల ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలన్నారు. అదే విధంగా కరెంట్, వాటర్, లోకల్ మున్సిపల్ నుంచి అందుతున్న నిత్యావసర సౌకర్యాలు కూడా నిలిపివేయాలని కోరుతున్నామని పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు షాహెన్షా, అశోక్, ఆనంద్, అర్వింద్‌గౌడ్ ఉన్నారు.

కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలి



ఈడబ్ల్యూఎస్ సముదాయంలో గేట్ వాల్వ్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

మూసాపేట: ఈ ఫొటోలో వీళ్లు శుభ్రం చేస్తున్నది మ్యాన్‌హోల్ అనుకుంటున్నారా.. కాదు తాగునీటిని సప్లై చేసే గేట్ వాల్వ్. భరత్‌నగర్‌కాలనీలోని ఈడబ్ల్యూఎస్ సముదాయంలో మ్యాన్‌హోల్‌పై నుంచి నీటిని సప్లై చేసి వెళుతున్నారు. కానీ అందులో పేరుకుపోయిన చెత్తాచెదారం, వాటర్ బాటిల్స్, మురుగు నీటిని తీయటం లేదు. దీంతో ఆ కాలనీవాసులకు కలుషిత నీరు సరఫరా అవుతోంది. అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మ్యాన్‌హోల్ తెరిచి చూడగా మురుగు నిండిపోయింది. ఆ తర్వాత సిబ్బంది మురుగును శుభ్రం చేశారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

మూసాపేట: మూసాపేట జనతానగర్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో సోమవారం కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐ నగేష్ మాట్లాడుతూ.. రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తగా దాటాలన్నారు. తమ తల్లిదండ్రులు వాహనాలపై వెళ్తున్నప్పుడు హెల్మెట్‌ను ధరించాలని గుర్తు చేయాలన్నారు. పిల్లలు చెబితే తల్లిదండ్రులు హెల్మెట్ పెంటుకుంటారన్నారు. రోడ్డుకు ఎడమ వైపు నడవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే 100కి డయల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పుట్టిన రోజులకు హెల్మెట్ గిఫ్ట్‌గా ఇస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ బాలికల పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ నగేష్

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

- జిల్లా విద్యాధికారి విజయకుమారి
- సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు



ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ

కూకట్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు బోధన తరగతులను నిర్వహించాలని జిల్లా విద్యాధికారి విజయకుమారి అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి ప్రధానోపాధ్యాల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వంద శాతం ఫలితాల సాధనకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యక్ష ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. 10/10 జీపీఏ సాధించే విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. ఫిబ్రవరిలో జరిగే గ్రాండ్ టెస్టులకు, ప్రీ ఫైనల్ పరీక్షలకు విద్యర్థులను సిద్ధం చేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను దత్తత తీసుకొని ఎప్పటికప్పుడు వారిని చైతన్యం చేయాలని తెలిపారు. ఉదయం, సాయంత్రం తప్పకుండా 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారులు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అవంతినగర్‌తోట అధ్యక్ష ఎన్నికకు నామినేషన్ షురూ

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. మొదటి రోజు ఇద్దరు అభ్యర్థులు జి. వెంకటేశ్వర్లు, గోపాల్ చౌదరిలు తమ మద్దతుదారులతో వచ్చి నామినేషనన్లు ఎన్నికల అధికారులైన దత్తాత్రేయ, ఎల్ఐసీ కృష్ణలకు అందజేశారు. ఈనెల 31న అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 4 ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు, కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు. సొంత ఇల్లు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఎన్ఈపీ-2020 విజన్‌కు అనుగుణంగా శిక్షణ

రాయదుర్గం: నూతన జాతీయ విద్యావిధానం-2020 విజన్‌కు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను ఫ్యాకల్టీ నిర్వహిస్తున్నారని యూజీసీ-ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్ ఫాతిమా అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూజీసీ ఎంఎంటీటీసీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా వారం రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. యూజీసీ ద్వారా నిర్వహించే ఈ కార్యక్రమం 'అప్లికేషన్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ టూ ఇంజినీరింగ్ ప్రాబ్లమ్స్' అనే అంశంపై యూజీసీ మాలవ్యమిషన్ టీచర్స్ ట్రైనింగ్ సెంటర్ (యూజీసీ-ఎంఎంటీటీసీ) పర్యవేక్షణలో ఆన్‌లైన్ ద్వారా శిక్షణను ఇస్తున్నామన్నారు. నూతన విద్యావిధానాన్ని అన్ని చోట్లా అమలు చేసేలా ప్రభుత్వం చూస్తుందని, స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చారన్నారు. దేశవ్యాప్తంగా 50కి పైగా ఈ శిక్షణలో పాల్గొంటున్నారని, అందులో ఉస్మానియా యూనివర్సిటీ, నిట్, పాట్నా నుంచి రిసోర్స్ పర్సన్లు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ ఢిల్లీ, అలీఘర్ ముస్లిమ్ యూనివర్సిటీలకు చెందిన వారు పాల్గొంటున్నారన్నారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. యూజీసీ-ఎంఎంటీటీసీ అధికారులు పలువురు ప్రొఫెసర్లు కూడా పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కలెక్టరేట్ ప్రజావాణికి 129 ఫిర్యాదులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ప్రజల నుంచి 129 అర్జీలు స్వీకరించారు. ఇందులో భూవివాదాలు ,ధరణి, డబుల్ బెడ్రూం ఇళ్లు , అక్రమ కట్టడాలు , భూకబ్జాలు తదితర వాటికి సంబంధించిన ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

రాయదుర్గం: హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ హోంగార్డుల చైర్మన్, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని హోంగార్డుల బృందం కలిసి విన్నవించింది. అంతకు ముందు ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ వెంటనే హోంగార్డుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అశోక్, కొత్వాల్ దయానంద్,కుమారస్వామి, సైబరాబాద్ అశోక్‌కుమార్, హరిబాబు, వికారాబాద్ చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆందోళన

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీలు ,ఆశ్రమ పాఠశాలు, కళాశాల హాస్టళ్లకు సంబంధించిన మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, రాథోడ్ సంతోష్ ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వాన్ని పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని చాలా సార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలను అమలుచేయకపోవటంతో వార్డెన్లు అప్పులు తెచ్చి హాస్టళ్ల నడుపుతున్నారని, దీంతో పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి కల్పించలేకపోతున్నారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పెడతామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో షిఫ్ట్‌వైస్‌గా నడుస్తున్న జూనియర్, డిగ్రీ కళాశాలలను రెగ్యులర్‌గా నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల్లో నూతన జూనియర్ కళాశాలలు, మేడ్చల్ నియోజవర్గంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఉప్పల్ మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలన్నారు. అలాగే జిల్లాలో గుర్తింపులేని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చాలా విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ ,టీచర్స్, వర్కర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సుమంత్, వంశీ, మనీకందు, అరుణ్, శ్యాంరావు, కార్తీక్, అవినాశ్, అనుదీప్, శివసాయి, మనీశ్, అజయ్, గిరిధర్, రాకేశ్, భూపతి పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రధాని ఎంతో ప్రోత్సహిస్తున్నారు

- రాజ్యసభ సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్
- అయోధ్య రామ వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా రమ్యా గ్రౌండ్ టీమ్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డా.లక్ష్మణ్, ముమ్మారెడ్డి ప్రేమకుమార్, హరీష్‌రెడ్డి



రమ్యాగ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వాలీబాల్ టీమ్‌లతో పన్నాల హరీష్‌రెడ్డి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్, బీజేపీ మల్కాజ్‌గిరి అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో అయోధ్య రామ వాలీబాల్ టోర్నమెంట్‌ను కేపీహెచ్‌బీ కాలనీ రమ్యాగ్రౌండ్స్‌లో నిర్వహించారు. సోమవారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోధ్య రాముడి పేరుతో టోర్నమెంట్ నిర్వహించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎప్పుడూ ముందుంటారన్నారు. కొన్ని లక్షల సంఖ్యలో యువకులు క్రీడారంగంలో రాణిస్తున్నారని తెలిపారు. ఒలింపిక్స్‌లో పెద్ద ఎత్తున మెడల్స్ సాధిస్తున్నారంటే ప్రధాని ప్రోత్సాహమేనని చెప్పారు. టోర్నమెంట్ నిర్వహించిన హరీష్‌రెడ్డిని ఆయన అభినందించారు.

◆ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఫైనల్స్‌లో కేపీహెచ్‌బీ రమ్యా గ్రౌండ్ టీమ్, ఎఎస్ఆర్ టీమ్ రోడ్ నం.1 మధ్య హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో రమ్యాగ్రౌండ్‌టీమ్ గెలిచింది. రన్నర్స్‌గా ఎఎస్ఆర్ టీమ్, మూడో స్థానంలో కేపీహెచ్‌బీ బీ-టీం నిలిచిందని తెలిపారు. టోర్నమెంట్‌లో మొదటి బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకట్‌రాజు, సాయినాథ్ రెడ్డి, తిరుమలరావు, చిన్న, ఆనంద్, జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, బీజేపీ నాయకులు ప్రీతంరెడ్డి, విజిత్, పప్పు పటేల్, బాడ్మింటన్ అధ్యక్షుడు నారాయణరావు, శ్యామలరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.